

హైదరాబాద్ వార్త

# ఎండలు సుర్రుమంటున్నయ్..!

**-బయటికి రావాలంటేనే భయపడుతున్న ప్రజలు**
**-ఒంట్లో నీటి శాతం తగ్గనివ్వద్దు**
**-భానుడి ప్రతాపం..ఆరోగ్యంపై ప్రభావం**



**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త**

ఎండలు మండుతున్నాయి. టెంపరేచర్ టాప్ లేపుతోంది. ఉదయం 7 గంటల నుంచే సూరీడు చుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం సమయానికి ఉష్ణోగ్రతలు భగభగలాడిపోతున్నాయి. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయని చెబుతుంటారు. కానీ ఈసారి రోహిణి కార్తె రాకముందే భానుడు విశ్వరూపం ప్రదర్శించాడు. ఎండలకు తోడు పశ్చిమ వాయువ్య దిశ నుంచి వీస్తున్న వేడిగాలులతో ప్రజలు సతమతమవుతూన్నరు. ఎండలు మండిపోతుండటంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 42 డిగ్రీల సెల్సియస్ దాటింది. రానున్న రెండురోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. నిత్యం ఎండలో తిరిగేవారు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీరికి ఎక్కువగా డీ హైడ్రేషన్ ముప్పు ఎక్కువ. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాయామం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు.

వ్యాయామం ఉదయం ఆరు నుండి ఏడు గంటల మధ్య పూర్తి చేసుకోవాలి. బారెడు పొద్దెక్కిన తర్వాత వాకింగ్ వద్దు, బయట పనులు ఉదయం 9గంటలలోపు పూర్తి చేసుకోవాలి. మధ్యాహ్నం 3 గంటలోపు ఎండలో తిరగడం మంచిది కారు. పిల్లల్ని సాయంత్రం తర్వాతే ఆడుకోనివ్వాలి. ఉక్కపోతకు చెమట రూపంలో శరీరంలో నీరంతా బయటకు పోతున్నపుడు నీరసం వస్తుంది. అలసట, నిస్సత్తువ ఉంటుంది. మంచి ఆహారం, ఆరోగ్య పానీయాలతో నిస్సత్తువకు చెక్ పెట్టవచ్చునని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని చెబుతున్నారు. మాంసాలు, ఉప్పు, కారం ఉండే కూరలు, వేపుళ్ళు ఎక్కువగా తీసుకోవద్దు. నీళ్ళ శాతం ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో చేసుకునే పదార్థాలు తీసుకోవడం మేలు చేస్తాయి. ఉప్పు కలిసిన నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటి ద్రావణాలు తీసుకుంటే నీరసం దరిచేరదు. కీర దోస, క్యారెట్, క్యాబేజి, ఉల్లి, టమాటా ముక్కలు, పెరుగుతో సలాడ్లు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవచ్చు. లెమన్ రైస్, కొత్తమీర రైస్, పుదీనా రైస్, పాలక్ రైస్ చేసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. అవసరమైతే ఉదయం సాయంత్రం చపాతీలు తీసుకోవచ్చు. మధ్యాహ్నం మాంసాహారం తినకపోవడం మంచిది. భోజనం తరువాత ఏదైనా ఒక ఫ్రూట్ తప్పనిసరిగా తీసుకోవాలి. మామిడి, కర్బూజ, ఫైనాపిల్, బొప్పాయి లాంటివి తీసుకుంటే శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతాయి. భోజనం చివర పెరుగు లేదంటే మజ్జిగ తీసుకుంటే శరీరానికి సోడియం, పొటాషియం అందుతుంది. నిస్సత్తువ దరిచేరదు. ఎండలో ఎక్కువ పనిచేసేవారు అన్నంతో పాటు ములక్కాయ, సొరకాయ, పొట్లకాయ, క్యారెట్, అనపకాయ ముక్కలు వేసి సాంబారు చేసుకోవాలి.

**-వాతావరణం చల్లగా ఉన్నప్పుడే పనులు పూర్తి చేసుకోండి. ఉదయం 10 గంలల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండలోకి వెళ్లకపోవడమే మేలు.**

**-ఇళ్లు దాటి బయట అడుగు పెడితే తప్పని పని సరిగా గొడుగు, టోపీ లాంటివి వాడండి దీనివల్ల వడదెబ్బకు గురికారు.**

**-తేలికపాటి, వదులుగా ఉండే లైట్ కలర్స్ వస్త్రాలను ధరించాలి. అవి ఎక్కువగా ఉష్ణాన్ని గ్రహించవు.**

**-ఎండలో పనిచేసేవారు రోజుకు 4-5 లీటర్ల నీళ్లు తప్పనిసిరిగా తాగండి. మధుమేహులు అయితే కనీసం 3-5 లీటర్లు నీటిని తాగాలి.**

**-పనులపై ఎండకు బయటకు వెళుతుంటే నీళ్ల బాటిల్‌తోపాటు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా నిమ్మరసం వెంట ఉంచుకోండి.**

**-ఇంట్లో ఉన్న గంట గంటకు ద్రావణాలు తీసుకోవాలి. మంచి నీరుతో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన బత్తాయి, నిమ్మరసం తీసుకుంటే శరీరానికి లవణాలు, పొటాషియం లాంటివి అందుతాయి.**

**-వేసవిలో చల్లదనం కోసం మద్యం తాగితే శరీరం త్వరగా డీహైడ్రేట్ అవుతుంది. మజ్జిగ, ఐస్ కలపని పండ్ల రసాలు మంచిది.**

**-శరీరం డీహైడ్రేట్ కాకుండా నీటి శాతం ఎక్కువగా ఉన్న కూరలు తినాలి. భోజనంలో సొర, బీర, దోసకాయ, ఆకుకూరల వంటకాలు ఉండేలా జాగ్రత్త వహించాలి. కీరదోస, పుచ్చకాయ, దానిమ్మ, కర్బూజ లాంంటి పండ్లు తినాలి.**

**-అధికంగా వ్యాయామం చేస్తే శరీరం డీహైడ్రేట్ అయి కిడ్నీలు, గుండె వైఫల్యం చెందే ప్రమాదం ఉంది. ఉదయం 6-7 గంటల మధ్య వ్యాయామాలు పూర్తి చేయాలి.**

## మురికి వాడలు లేని నగర నిర్మాణమే లక్ష్యం : మంత్రి తలసాని



కమలా నగర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్ళ ప్రారంభోత్సవాలలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్

**యూసుఫ్‌గూడ, మే 18, ప్రభాతవార్త**

మురికి వాడలు లేని నగర నిర్మాణమే లక్ష్యంగా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ళు నిర్మిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలను ఆదుకుంటున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజక వర్గం రహ్మత్‌నగర్ డివిజన్ పరిదిలోని ఎస్‌పిఆర్ హిల్స్ కమలా నగర్‌లో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం నిర్మించి ప్రారంభోత్సవంను స్థానిక శాసన సభ్యులు హైదారాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మాగంటి గోపినాథ్‌తో కలిసి ప్రారంభించారు. విశ్వ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌ను మురికి వాడలు లేని నగరంగా మార్చాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే రహ్మత్‌నగర్ ఎస్‌పిఆర్ హిల్స్‌లోని కమలా నగర్‌లో 17,85లక్షల వ్యయంతో చేపట్టిన 210 డబుల్‌బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌తో కలిసి ప్రారంభించారు. 210 డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణానికి మొత్తం 16కోట్ల, 27లక్షల 50వేలు ఖర్చుచేయగా రూ.15.50లక్షల వ్యయంతో మౌళిక సదుపాయాలు కల్పించారు. ఈకాలనీలో లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు విద్యుత్ సౌకర్యంతో పాటు 15 దుకాణాలను ఏర్పాటుచేశారు. ఒక్కొక్కటి 560ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో రూ.7.75లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ కాలనీకి డబుల్ బెడ్ రూం డిగ్నిటీ కాలనీగా నామకరణం చేశారు. మొదటి రోజు ప్రారంభోత్సవం సందర్భంగా 89 మందికి లాటరీ పద్దతిలో ఇంటి తాలాలను అందజేశారు. గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి పేదలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అందులో భాగంగానే ప్రజలకు పథకాలు, ఉచిత మంచినీరు, 24గంటల విద్యుత్ సరఫరా, ఫింఛన్లు, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, దళిత బందు, ఆడబిడ్డ పుడితే 13వేలు, మగబిడ్డ పుడితే 12వేలు, కేసీఆర్ కిట్టు రైతు బందు, ఈవిధంగా అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈడబుల్ బెడ్‌రూం ఇళ్ళల్లో వాటి మేంటెనెన్సు కోసం నెలనెల ఖర్చులు ఉంటాయని పేదలపై భారం పడకుండా 15వ్యాపార సముదాయాల నుంచి వచ్చే సొమ్ముతో వాటిని మేయింటెనెన్స్ చేసుకోవాలని సూచించారు. కొందరు తమకు ఇళ్ళు రావట్లేదని అసంతృప్తితో ఉన్నారని వారికి కూడా స్థానికంగా ఒకమిటీని ఏర్పాటుచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళు అందేలా స్థానిక శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ తీసుకుంటారన్నారు. ఏఒక్కరు కూడా దళారులను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని ఎవరైనా ఈడబుల్ బెడ్ రూం ఇళ్ళను అమ్మిన కొన్నా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్‌లో పెట్టడం జరుగుతుందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జెఎన్‌ఎమ్ ఆర్ఎఫ్ కింద ఇళ్ళు నిర్మించారని అయితే ప్రభుత్వానికి బకాయిలు చెల్లించాల్సి ఉండగా తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలను దృష్టిలో ఉంచుకుని వాటి మొత్తంలో రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. నగర వ్యాప్తంగా లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్ళు నిర్మించడం జరిగిందని అయితే కాంగ్రెస్ బీజేపి ప్రతిపక్షాలు లేని పోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజలు వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. అనంతరం శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని అన్నారు. పేదలకు అన్ని వేళల అండగా నిలవడం జరుగుతుందని నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభీవాణిదేవి, నీర్జా రహమత్ బేగ్, ఆర్డీవో వసంత, ఎమ్.ఆర్.వో నవీన్, హౌసింగ్ అధికారి వెంకటరెడ్డి, కార్పోరేటర్‌లు సిఎన్‌రెడ్డి, దేదిప్యవిజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్, మాజీ కార్పోరేటర్ మహ్మద్ షరీఫ్, డి.సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శని,ఆదివారాల్లో హైదరాబాద్ దర్శన్ బస్సులు : అపర్ణ కళ్యాణి

**కంటోన్మెంట్,మే 18 ప్రభాతవార్త:** నగరంలోని వివిధ పర్యాటక కేంద్రాలను దర్శించుకునేందుకు ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్ దర్శన్ పేరుతో ప్రత్యేక బస్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసి సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్.ఎం. అపర్ణ కళ్యాణి తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్టేన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు ఎసికింద్రాబాద్ ఎస్టేన్ అల్ఫాహోటల్ నుంచి బయలు దేరుతుందన్నారు. తిరిగి రాత్రి 8.30 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ బస్సుల్లో గైడ్ సౌకర్యం కూడా కల్పించడం కూడి జరిగిందన్నారు. ఒక్కొక్క ప్రయాణికుడి టికెట్ ధర పెద్దలకు రూ.250, పిల్లలకు 130 రూపా యలు ఉంటుందన్నారు. అదే విధంగా ఏసీ బసు ్సలకు పెద్దలకు రూ.450, రూ.340 టికెట్ ధర ఉంటుందన్నారు. అదే విధంగా ఈ టికెట్లను టీఎస్. ఆర్టీసి ఆన్‌లైన్ దా ్వర కూడా టికెట్ తీసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రయా ణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి : తహసీల్దార్ మాధవి రెడ్డి

**కంటోన్మెంట్,మే 18 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు తమ తమ ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం విడుదల చేసిన 58,59 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని మారేడ్‌పల్లి తహశీల్ధార్ కె. మాధవిరెడ్డి తెలిపారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు 59 జీవోకింద దరఖా స్తు చేసుకుంటే వారికి రిజిస్ట్రేన్‌కు సంబంధించిన హక్కులు ఉంటాయన్నారు. దారిద్రరేఖకు దిగువనుండి కడుబీదవారు అయితే 58 జీవో కింద దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

**ఆసరా పింఛన్ గుర్తింపు కార్డులు తీసుకోవాలి**

మారేడ్‌పల్లి మండలంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఆసరా పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి పెన్ ్షన్ గుర్తింపు కార్డులు వచ్చాయని, ఆ కార్డులను లబ్ధిదారులు తమ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని మారేడ్‌పల్లి తహశీల్ధార్ మాధవిరెడ్డి తెలిపారు. పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డులను చూపించి తమ కార్యాలయంలో పెన్ ్షన్ ఐటీ కార్డులు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## గొప్ప నాయకుడు తారకరామారావు



మోతీనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, మే 18, ప్రభాతవార్త :**

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన గొప్ప నాయకుడు నందమూరి తారకరామారావు అనీ శాసన సభ్యులు మాదవరం కృష్ణారావు అన్నారు. అభిమాన నాయకుడు ఎన్టీఆర్‌పై తనకున్న అభిమానాన్ని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు మరోసారి చాటుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో గతాన్ని గుర్తుపెట్టుకుని వారు చాలా అరుదుగా ఉన్నారు. అలాంటిది రాజకీయాలతో సంబంధం లేకుండ తన అభిమాన నాయకుడి శత జయంతి ఉత్సవాలు సందర్భంగా విగ్రహం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అనుమతి కోరడంతో పాటు విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని చూసి ఏర్పాటుచేశారు. ఆయన స్వయంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సిహెచ్ సత్యనారయాణ, కె రాజ్‌కుమార్ గౌడ్, చక్రపాణి, రత్నాకర్ రావు, రామారావు, అడుసుమిల్లి వెంకటేశ్వరావు, సత్య గుమ్మడిదళ, కార్తీక్, వీరభద్రరావు, వేణు, రాజా, శ్రీనివాస్, బినెపె చిన్నబ్బులు, చేకూరి హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్చిన వాగ్దానాలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నాం**

ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఎప్పటికపుడు పూర్తి స్థాయిలో పరిష్కకరిస్తున్నామని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. గురువారం అల్లాపూర్ గాయత్రి నగర్‌లో రూ.1కోటి 60లక్షల రూపాయల వ్యయంతో స్థానిక కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో కలిసి అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. ఇందులో ప్రధానంగా సున్నం చెరువు వద్ద పార్కు అభివృద్ధి కొరకు రూ.85లక్షలతో పనులు గాయత్రినగర్ షెటిల్ కోర్టు ఇండోర్ స్టేడియం వద్ద రూ.75లక్షలతో శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో కోట్లాది రూపాయలతో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, డియి ఆనంద్, ఏయి.రంజిత్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధానకార్యదర్శి పిల్లితిరుపతి, పార్వతమ్మ, జాహెద్ షరీఫ్, నాగుల సత్యం, సంజీవరెడ్డి, హనుమంతు నాయుడు, శ్రీనువాస్ రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, యోగిరాజు స్వామి పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టొద్దు

**-రౌండ్‌టేబుల్ సమావేశంలో హిందూ సంఘాల డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్,కరాటే కళ్యాణి, ప్రభాకర్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్, మే 18,ప్రభాతవార్త:**

శ్రీకృష్ణుడి రూపంలో మనిషి విగ్రహాన్ని పెట్టడం తగదని మాజీ మంత్రి కృష్ణయాదవ్ అన్నారు. దేవుడి రూపంలో మానవ విగ్రహాలు పెడితే సహించేదవి లేదన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని లకారం చెరువు మధ్యలో శ్రీకృష్ణుని రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని ఖండిస్తూ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జై శ్రీకృష్ణ జేఏసీ కన్వీనర్ ఎర్రగుడ్ల ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి భారత యాదవ సమితి, ఇస్కాన్ ప్రతినిధులతో పాటు మాజీ మంత్రి కృష్ణయాదవ్, కరాటే కళ్యాణి తదితరుల హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడి రూపంలో ఒక సినీనటుడు రాజకీయ నాయకుడైన ఎన్టీఆర్ విగ్రహాన్ని పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ అంటే తమకు కూడా అభిమానమేనని కానీ శ్రీకృష్ణుడు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఆరాధించే దేవుడు అన్నారు. కాబట్టి ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పెట్టి తమ మనోభావాలు దెబ్బ తీయొద్దన్నారు. ఈసమావేశంలో నాయకులు రమణకుమార్, బాలకృష్ణ, సుబ్బలక్ష్మీ, శ్రీశైలం యాదవ్, కృష్ణారెడ్డి, నాగరాజు, నగేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు మనవడు సేఫ్..తాత అరెస్ట్

**-కిడ్నాప్ ఘటనను ఛేదించిన బంజారాహిల్స్ పోలీసులు**

**హైదరాబాద్, మే18,ప్రభాతవార్త:** మద్యం కోసం మనవడిని కిడ్నాప్ చేసిన తాతను ఎట్టకేలకు గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్‌పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యానికి బానిసైన ఖలీల్ అనే వృద్ధుడు ..నెలరోజుల మనవడిని కిడ్నాప్ చేశారు. ఈఘటన స్థానికంగా కలకలం రేపింది. హకీంపేట ప్రాంతానికి చెందిన యస్మిన్ బేగం ప్రసవానికి తల్లిగారి ఇంటికి వచ్చింది. గత నెల 13న మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే మద్యానికి బానిసైన యస్మిన్‌బేగం తండ్రి ఖలీల్ డబ్బుల కోసం భార్య, కుమార్తెతో గొడవపడ్డాడు. చివరకు డబ్బులు ఇవ్వకపోవడంతో కోపోద్రోక్తుడైన ఖలీల్ ..పసికందు అని చూడకుండా బాబును కిడ్నాప్ చేశాడు. బిడ్డను ఎత్తుకెళ్ళి సదాశివ పేటలో దాచాడు. బాబు కిడ్నాప్‌పై యస్మిన్‌బేగం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు న మోదు చేసుకున్న పోలీసులు బాబు కోసం తీవ్రంగా గాలించారు. సిసిటీ వీ పుటేజీ ఆధారంగా ఖలీల్‌ను నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గుర్తించారు. బాబును ఎక్కడ దాచాడో చెప్పడంతో సదాశివపేటకు వెళ్లి పసికందును రక్షించారు. బాబును తల్లికి అప్పగించిన పోలీసులు ఖలీల్‌ను రిమాండ్‌కు తరలించారు.

## చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి

**అబ్దుల్లాపూర్‌మెట్, మే 18 ప్రభాతవార్త :** డయల్ 100 ద్వారా వచ్చిన సమాచారంతో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు మొహమ్మద్ సుఫియన్ హుస్సేన్ తండ్రి రహమత్ హుస్సేన్, వయసు 18 సంవత్సరాలు, సయ్యద్ అనాస్ తండ్రి సయ్యద్ హస్బెబ్ రహ్మాన్, వయసు 14 సంవత్సరాలు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు అందరూ కలిసి సంఘీలోని చెరువులో ఈతకై వచ్చారు. ప్రమాదవశాత్తూ మధ్యాహ్నం 2 గంటల సమయంలో సుఫీయన్, అనాస్ అను ఇద్దరు ఆ చెరువులో పడి మునిగిపోయారనే సమాచారం మేరకు వెంటనే ఎన్‌డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు కలిసి చెరువులో పడి చనిపోయిన ఇద్దరినీ వెలికితీసారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెరువులో పడి మృతి చెందిన అనాస్, హుస్సేన్ మృతదేహాలు



చెరువులో మృతదేహాలను గాలిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్, ఫైర్, పోలీసు సిబ్బంది



## హోరెత్తించిన ఉప్పల్ క్రికెట్ స్టేడియం

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ క్రికెట్ స్టేడియం హోరెత్తింది. గురువారం సన్ రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు మధ్య జరిగిన ఐపీఎల్ ట్వంటీ 20 మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. సన్ రైజర్ల జెండాలతో స్టేడియం ఉర్రూతలూగింది. క్రీడాకారు లకు మద్దతుగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ అభిమానాన్ని చాటారు. కాగా ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం బెంగళూరుకు అత్యావశ్యకం కావడం తో పాటు..ప్లేఆఫ్స్ రేసులో నిలవడానికి ఆ జట్టు టాప్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ, మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్‌ల ఆటతీరుపై అందరి దృష్టి నిలిచింది. మొత్తంగా ఉప్పల్ స్టేడియంలో మరో వేసవి సాయంత్రం పూర్తి వినోదాన్ని అందించింది.

# పర్మిట్‌రూం ఉన్నా ..రోడ్డుపైనే తిష్ట

**-వైన్స్ ముందే మందుకొడుతున్న మందుబాబులు**
**-ఫుట్‌పాత్,సర్వీస్ రోడ్లపైనే సిట్టింగ్**
**-అటుగా వెళ్ళాలంటే జంకుతున్న మహిళలు**
**-పట్టించుకోని పోలీస్,ఎక్సైజ్ అధికారులు**



**హైదరాబాద్, మే 18,ప్రభాతవార్త:**

నగరంలోని పలువైన్‌షాపుల ముందు మందుబాబులు బహిరంగ మద్యం సేవిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. మద్యంషాపు ముందున్న సర్వీస్ రోడ్డుపైనే మందుబాబులు కూర్చుని మద్యం సేవిస్తున్నారు. సాయంత్రం అయిందంటే చాలు ప్రాంతాలన్నీ జాతర తలపిస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు అరోపిస్తున్నారు. వైన్‌షాపుల వెనుకనే సిట్టింగ్ కోసం స్థలం ఉన్నా మద్యం సేవించేవారు అక్కడికి వెళ్లకుండా షాపుముందే వారి ద్విచక్ర వాహనాలను పార్క్‌చేసి అక్కడే మద్యం తాగుతున్నారు. అయినా షాపుల నిర్వాహకులు పట్టిచుకోకపోవడంతో రోజురోజుకూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి సంఖ్య ఎక్కువవుతందని స్థానిక ప్రజలు అంటున్నారు. అది చాలదన్నట్లుగా సమీపంలోనే గోడలపక్కన మూత్రవిసర్జన చేస్తునా ్నరు. దీంతో ఆప్రాంత పరిసరాలు కంపు కొడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. నగంలోని సికింద్రాబాద్, అంబర్‌పేట్, గోల్నాక, కాచిగూడ, దిల్‌షుక్‌నగర్, బోడుప్పల్ ,ఎల్బీనగర్, కొత్తపేట్, ముషీరాబాద్, గాంధీఆసుత్రి సమీపంలోని బోయగూడ ప్రాంతాల్లో ఈపరిస్థితి ఎక్కువగా కనబడుతుంది. సాయంత్రం పూట మహిళలు అటువైపు ు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. పర్మిట్‌రూమ్‌కు స్థల ం కేటాయించే నిర్వాహకులు వాహనాలకు మాత్రం పార్కింగ్ కేటాయించటంలేదు. దీంతో పార్కింగ్ ఎక్కడ చేయలో తెలియక రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో వాహనదారులు రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలుపుతున్నారు. ఆదీకాక వైన్‌షాప్‌నకు చుట్టు ప్రక్కల ఉన్న దుకాణాల ఎదుట వాహనాలు నిలుపుతుండటంతో వ్యాపారాలు చేసుకోలేక పోతున్నామని పలు దుకాణాదారులు వాపోతున్నారు. వైన్స్‌షాప్ ముందు పార్కింగ్ క్రమబద్ధీకరించేందుకు కనీసం మనిషిని కూడా పెట్టండం లేదు.

### నిబంధనలు గాలికి..

ఎక్సైజ్ పాలసీ కొత్త నిబంధనల ప్రకారం వైన్స్‌లను ఉదయం 10గంటల నుండి రాత్రి 11గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలి. ప్రతి వైన్స్‌లో రెండు సీసీకెమేరాలు ఏర్పాటు చేయాలి. బార్‌కోడింగ్ అమలు చేయాలి. ఇందు కోసం ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు కంప్యూటర్ ప్రింటర్ తప్పనిసరిగా ఉండి మద ్యం కొనుగోలు చేసిన వారికి కంప్యూటర్ బిల్లు తప్పని సరిగా ఇవ్వాలి. ప్రస్తుతం నగరంలో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. గతంలో రాత్రి 10.30 గంటల వరకు తెరిచి ఉంచేలా అనుమతించారు. ఈసారి మరోఅరగంట పొడిగించి రాత్రి 11గంటల వరకు తెరిచి ఉంచేందుకు మినహాయింపు ఇచ్చారు. అయితే కొన్ని వైన్సుల్లో ముందువైపు మూసివేసి వెనక భాగం షటర్ల కిందినుండి మద్యం ఇస్తున్నారు. మరికొందరు టూవీలర్స్‌లో పెట్టుకొని మద్యం కోసం వచ్చేవారిని కనిపెడతూ వారికి అధిక ధరలకు అర్ధరాత్రివరకు అమ్ముతున్నారు. ఇక నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని నిరోధించేందుకు బార్‌కోడ్ విధానం అమలు చేయాల్సిఉంది. దీంతో (ఒక కాటన్‌బాక్స్‌లో )ఎన్ని బాటిల్స్‌వచ్చాయి. ఎన్ని అమ్ముడు పోయాయనేది స్పష్టంగా తెలుస్తుంది. మద్యం కొన్న వారికి బార్‌కోడ్ నమోదు చేసి కంప్యూటర్ బిల్లు ఇస్తే ఎమ్మార్పీ ధర అమలయ్యే వీలుంది. ఎక్కువ ధర తీసుకోకుండా నిరోధించచ్చు. మరోవైపు ఎంత మద్యం విక్రయించారో ఎక్సైజ్ అధికారులకు ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. కొందరు మందుబాబులు మద్యం కొనుగోలు చేసి పర్మిట్‌రూమ్‌లలోకి వెళ్లకుండా బహిరంగ మద్యపానానికి పాల్పడుతున్నారు. చుట్టుప్రక్కల ఉన్న దుకాణాల ముందు కూర్చొని సేవిస్తున్నారు. దీంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని స్థానికుల వాపోతున్నారు. రాత్రి అయితే చాలు మద్యం దుకాణాల ముందు నుండి వెళ్లాలంటే జంకుతున్నామని వాపోతున్నారు. వైన్‌షాప్ పరిసర ప్రాంతాలు రాత్రయితే అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతూన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# సమస్యల వలయంలో అల్లాడుతున్న సరస్వతీ పుత్రులు

## విద్యార్థులు ఫుల్ - సౌలతులు నిల్ - సొంత భవనం లేక అల్లాడుతున్న డిగ్రీ విద్యార్థులు

### ప్రజాప్రతినిధుల చొరవ లేకపోవడంతో సమస్యలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు




మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ, జూనియర్‌కళాశాల భవనాల దృశ్యం

**నేరేడ్‌మెట్, మే 18 ప్రభాతవార్త :** ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు షిఫ్టింగ్ పద్ధతిలో విద్యనభ్యసిస్తూ ఇబ్బందులకుగురవుతున్న సంఘటన మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని నేరేడ్‌మెట్ వాజ్‌పెయినగర్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులకే చెందుతుంది. వివరాల్లోకి వెళితే మల్కాజిగిరి సర్కిల్ వినాయకనగర్ డివిజన్ వాజ్‌పెయినగర్ ప్రాంతంలో నాటి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే సాయన్న కృషితో 2004 లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ గ్రూప్‌లతో ఇంటర్మీడియట్ కళాశాలను నిర్వహిస్తున్నారు. అనంతరం 2013లో నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కృషిచేసి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నాంది పలికారు. జూనియర్ కళాశాల నిర్వహిస్తున్న ప్రాంగణంలోనే ఎమ్మెల్యే నిధులతో ఆరు రూములు నిర్మించి ఇచ్చారు. అయితే ఇంటర్మీడియట్ కళాశాల ఉన్న ప్రాంగణంలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగింది. రాను రాను విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్లు రావడంతో తరగతి గదులు సరిపోక ఉదయం జూనియర్ కళాశాల నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం నుంచి డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు.

**మల్కాజిగిరి ప్రజలకు అందుబాటులో ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాల....**

మల్కాజిగిరిప్రజలకు అందుబాటులో ఈ కాలేజ్ ఉండడంతో ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలు విరివిగా వస్తున్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు దాదాపు 1200మంది విద్యార్థులు ఉండగా, జూనియర్ కళాశాల విద్యార్థులు 1100 మంది విద్యార్థులతో వాజ్‌పేయినగర్‌లోని ప్రభుత్వ కాలేజ్ నిర్వహిస్తున్నారు. కనీససౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్ విద్యార్థులు 75శాతం ఉత్తీర్ణత, డిగ్రీ విద్యార్థులు 80శాతం ఉత్తీర్ణతతో ముందుకు కొనసాగుతున్న విద్యా సంస్థ, మరిన్ని సౌకర్యాలందిస్తే నూరు శాతం ఉత్తీర్ణత శాతం తీసుకొస్తామని కళాశాల ప్రిన్సిపాల్ శైలజ పేర్కొన్నారు.

**డిగ్రీ కళాశాలకు టైటిల్ డీడ్ లేక ఇబ్బంది.......**

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు టైటిల్ డీడ్ లేక పోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ప్రధానంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం, స్థలం లేక పోవడంతో కేంద్రం ప్రభుత్వం అందించే రుసా నిధులు ఉపయోగించుకోలేనీ పరిస్థితి నెలకొందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉప ప్రిన్సిపల్ రమేష్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు బోధించే లెక్చరర్లు సమృద్ధిగా ఉన్నప్పటికీ, ఒకే ఆఫీస్ కార్యాలయంతో సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్తితి నెలకొందని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణం, మూత్రశాలలు, మంచి నీరు, తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయించాలని సంబంధిత అధికారులకు పిర్యాదు చేసిన సమస్య అలా నే ఉందని వారు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డిగ్రీ కళాశాల టైటిల్ డీడ్‌కు కృషి చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరుతున్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి : చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ



పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్‌ఎస్‌లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ అనురాధ

**తుర్కయంజాల్, మే 18 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్న గూడ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘపరిధిలోని పారిశుద్ధ్య సిబ్బందికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీళ్ళ డబ్బా, ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. త్వరలో పారిశుద్ధ్య సిబ్బందికి నిపుణులైన వైద్య సిబ్బందితో హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సాబేర్ అలి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్‌గౌడ్, బిఆర్‌ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్‌నాయక్, సానిటరీ ఇన్స్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జవాన్లు పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు పిఅండ్‌టీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**ఎల్.బి.నగర్, మే 18 ప్రభాతవార్త :** పిఅండ్‌టీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ, లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట, ఎం.ఎస్.జే హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఈనెల 20వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా తెలిపారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కొరకు ఉచిత వైద్య శిబిరాన్ని పిఅండ్‌టి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. 20వ తేదీన కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించే శిబిరంలో అనుభవజ్ఞులైన 15 మంది వైద్యబృందం పాల్గొని అవసరమైన పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3 గంటలవరకు శిబిరం కొనసాగుతుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కార్పొరేటర్ అరుణ



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, మే 18 ప్రభాతవార్త:** కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఇంద్రప్రస్త కాలనీలోని కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీలలో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగన్, శేఖర్‌బాబు, గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మౌనిక, అశ్విని, జానకి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 17 లక్షలతో సీసీ రోడ్డు పనులు : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, మే 18 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీలో రూ. 17 లక్షలతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేదిలేదు

### బ్రోకర్లను అశ్రయించి అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవు : డీసీపీ గజానంద్




శ్రీకృష్ణనగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేయిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

**నేరేడ్‌మెట్, మే 18 ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని టౌన్ ప్లానింగ్ డిసిపి గజానంద్, సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్‌లు పేర్కొన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు పలువురు తమకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేసి నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి నిర్మాణాలు కూల్చి వేస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో నిబంధన విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు తమ సిబ్బందితో కలిసి వెళ్లి కూల్చివేశారు. ఈ సందర్భంగా డిసిపి గజానంద్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో కొంతమంది మధ్యవర్తులు టౌన్ ప్లానింగ్ అధికారుల పేర్లు చెప్పుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మధ్యవర్తుల మాటలను నమ్మి అక్రమనిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణదారులు జిహెచ్‌ఎంసి నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలు గుర్తించి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే వాటిని కూడా కూల్చివేస్తామని తెలిపారు.

## క్రైస్తవుల అభ్యున్నతికి సిఎం కేసీఆర్ కృషి : బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, మే 18 ప్రభాతవార్త :** క్రైస్తవుల అబ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని క్రైస్తవ మత పెద్దలతో గురువారం అరవింద్‌శర్మ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవుల బాగోగుల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో క్రైస్తవుల గురించి మూడున్నర ఎకరాలు స్థలం ఇచ్చినందుకు త్వరలో ఆర్కేపురం డివిజన్ క్రైస్తవుల తరఫున మంత్రి సబితకు అభినందన సభ ఏర్పాటు చేస్తామని స్థానిక క్రైస్తవులు చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్ని మతాలు కులాలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మహేశ్వరం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో సబితమ్మని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జాన్, జయరాజ్, కుమార్ మారుతి, శాంసంగ్ సంజీవ్, కుమార్, ఏసయ్య, అమృత్ ఆనంద్, అబ్రహం, సాల్మన్జీ, చారయ్య, ప్రవీణ్, పాపయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దడానికి కృషి : ప్రిన్సిపల్ సురేష్‌బాబు

**మలక్‌పేట, మే 18 ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దడానికి కృషిచేస్తున్నామని దిల్‌సుక్‌గనర్ సాయిచైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్ష ఫలితాలలో సిఇసి విభాగంలో సాయిసుస్మిత 3వ ర్యాంకు, మరియం 4వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో జె.శృతి 8వ ర్యాంకు, వై.సాహన 10వ ర్యాంకు సాధించారని వివరించారు. అదేవిధంగా తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి తమ సత్తాను మరోసారి చాటారని తెలిపారు. విద్యార్థులు అంకిత భావంతో చదువుకు తమ లక్ష్యసాధనకోసం కృషి చేయాలన్నారు. పాఠ్యాంశాలను బోధించడంతోపాటు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్, లక్ష్మణ్‌లకు ఘన స్వాగతం



ర్యాలీగా తరలివస్తున్న బండి సంజయ్, లక్ష్మణ్, సామ రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, మే 18 ప్రభాతవార్త :** నాగోల్‌లో జరుగుతున్న తెలంగాణ ఓబీసీ సమ్మేళన సమావేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌లకు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బండి సంజయ్‌కుమార్, లక్ష్మణ్, నరసయ్యగౌడ్‌లను చైతన్యపురి శివాజీ విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైతన్యపురిలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వేలాది ద్విచక్ర వాహనాలతో చైతన్యపురి నుండి నాగోల్ వరకు భారీ ఊరేగింపుగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్, కార్పొరేటర్లు రంగ నరసింహగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్, పవన్‌కుమార్, కళ్లెం జీవన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, ఎలిమినేటి జంగారెడ్డి, వినోద్‌కుమార్, దాసరి జయప్రకాష్, రింకుగౌర్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, రుద్రారపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంకులు సాధించిన న్యూ మాస్టర్ మైండ్స్ విద్యార్థులకు సన్మానం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన బడంగ్‌పేట్‌లోని న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాలేజీ ఛైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రావు, సెక్రటరీ డాక్టర్ పాండు రామావత్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపిసిలో 4వ ర్యాంకు, బైపిసిలో 4వ ర్యాంకు, ఎంఇసిలో 4వ ర్యాంకు, సిఇసిలో 8వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటిలో సైతం సీట్లు సాధించిన విద్యార్థులను, సిఎలో అర్హత సాధించిన వారిని అభినందించారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



కార్తికేయనగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, మే 18 ప్రభాతవార్త:** నాచారం కార్తికేయనగర్‌లో రూ. 80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జినిర్మాణం పనులను కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ గురువారం పరిశీలించారు. కొన్ని అడ్డంకులు వచ్చిన క్రమంలో కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ ఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరింపజేశారు. పది మాటర్ల వెడల్పుతో విశామైన బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాచారం ఓల్డ్ విలేజ్ భూగర్భ డ్రైనేజీ పనుల నమిత్తం రూ.36లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులను కూడా ప్రారంబిస్తామని చెప్పారు. నిధులు మంజూరైనప్పటికి కొందరు నాయకులు ధర్నా చేయడం విడ్డురంగా ఉందన్నారు. డివిజన్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, నాయకులు సాయిజన్ శేఖర్, కట్టబచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, రఫిక్, సుగుణాకర్ రావు, శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్ : అమ్జదుల్లాఖాన్



ప్రజా దర్బార్ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న అమ్జదుల్లాఖాన్

**మలక్‌పేట, మే 18 ప్రభాతవార్త :** ప్రజలసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంకోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంబిటి అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ పేర్కొన్నారు. చంచల్‌గూడ ఎంబిటి కార్యాలయంవద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలు తాము ఎదుర్కుంటున్న సమస్యలగురించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు పేర్కొన్న సమస్యలకు వెంటనే ఆయన స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సంవత్సరాలనుండి ఎంబిటి కార్యాలయంవద్ద నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. వివిధ రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆర్థికంగా తమవంతు సహాయ, సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల వివాహాలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నామన్నారు. కులమతాలకతీతంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.

## పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సిఎం కేసీఆర్ ధ్యేయం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, మే 18 ప్రభాతవార్త :** పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో నూతనంగా నిర్మించే టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం పనులను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచి వైద్యంకోసం వేలాదిమంది ప్రజలు ఆరోగ్య సమస్యలపట్ల ఇక్కడి వస్తున్న నేపథ్యంలో నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రిలో వైద్యం అందించడం భారంగా మారడంతో నగరంనలుమూలల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. సుమారు రూ.1200కోట్ల వ్యయంతో 1000 పడకలతో సూపర్ స్పెషలిటీ హాస్పిటల్స్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. హాస్పిటల్ నిర్మించడానికి ఎల్ అండ్ టీ సంస్థ టెండర్లు దక్కించుకుందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హాస్పిటల్ నిర్మాణ పనుల్లో భాగంగా అధికారులతో కలిసి పర్యటించామన్నారు. హాస్పిటల్ నిర్మాణంతో పాటు స్థానిక అవసరాల దృష్ట్యా 2400 గజాల్లో ఉద్యానవనం, 3వేల గజాల స్థలంలో పోలీస్‌స్టేషన్, 2వేల గజాల స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్, 5వందల గజాల్లో దేవాలయం, మసీదు, 1000 గజాల స్థలంలో నూతన రిజర్వాయర్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. తాగునీటి సమస్యను తీర్చడానికి గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడానికి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. రిజర్వాయర్ పనులు పూర్తి అయితే చుట్టుపక్కల కాలనీ వాసులకు లోప్రేషర్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అత్యున్నత హంగులతో నూతన పోలీస్‌స్టేషన్, చిన్నపిల్లలు, పెద్దలు, మహిళలు, యువత, సీనియర్ సిటిజన్స్ కోసం పార్క్ నిర్మాణం పనులను చేపడుతున్నామన్నారు. హాస్పిటల్‌కు వచ్చే వారి వాహనాలు పార్కింగ్ కోసం మల్టిలెవల్ కార్‌పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి బిఆర్‌ఎస్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, అవిరెడ్డి భూపేష్‌రెడ్డి, శ్రీకాంత్, అధికారులు భాస్కర్‌రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పటిష్టతకు కృషి : డిసిసి అధ్యక్షుడు నర్సింహారెడ్డి



చల్లా నర్సింహారెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రెండవ పర్యాయం డిసిసి అధ్యక్షునిగా నియమితులైన చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీఅనంతరం వివిధ నియోజకవర్గాలనుండి తరలివచ్చిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నర్సింహారెడ్డిని గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తన నియాకమానికి సహకరించిన పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి,, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్ని మతాలను గౌరవించే విధానం కాంగ్రెస్ సొంతం : మల్‌రెడ్డి రాంరెడ్డి



ఫాస్టర్ల సమావేశంలో మహిళలతో మల్‌రెడ్డి రాంరెడ్డి

**హయత్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** అన్ని మతాలను గౌరవించే విధానం కాంగ్రెస్ పార్టీ సొంతమని... కాంగ్రెస్ పార్టీ హయాంలో క్రైస్తవులను సముచిత న్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఇంఛార్జీ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో గురువారం నిర్వహించిన ఫాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్రైస్తవులను ఆయా పార్టీలు ఓటుబ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అన్ని మతాల అభివృద్ధికి సహకారం అందించిందన్నారు. క్రైస్తవుల సమస్యలను తమకు తెలపాలని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి వాటిని తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో క్రైస్తవులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి మండల కమిటీ అధ్యక్షుడు రంగారావు, ఫాస్టర్లు జాన్, విజయ్‌చందర్, చర్చి మెంబరు ఎబినైజర్, పార్టీ నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, బింగిదాస్, జైపాల్‌రెడ్డి, అరుణ్, భాను పాల్గొన్నారు.

## మేరీ లైఫ్ -మేరీ స్వచ్ షెహర్‌కు సహకరించండి: కమిషనర్ సాబేర్ ఆలీ

**తుర్కయంజాల్, మే 18 ప్రభాతవార్త :** మేరీ లైఫ్ – మేరీ స్వచ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలో చెత్త తగ్గించటం, పునర్వినియోగం, రీసైక్లింగ్, విధానాన్ని ఈ నెల 20 నుంచి జూన్-5 వరకు అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొన్నట్లు కమిషనర్ సాబేర్ అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ళలో నిరుపయోగంగా యున్న దుస్తులు, బూట్లు, చెప్పులు, పుస్తకాలు, పిల్లలు ఆడుకొనే బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత సైకిళ్ళు, ఇనుప కుర్చీలు, ఎల్రక్టానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటరకు అందిస్తే వారు వీటిని అవసరమున్నవారికి అందించటం లేదా తిరిగి రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఇవ్వటం ద్వారా కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.